చెరువునిండా నిర్లక్ష్యం

- మురుగుకూపంగా వెంకటాపురం తుమ్మల చెరువు
- చవితి నాడు వందలాది వినాయక విగ్రహాలు నిమజ్జనం
- రెండు నెలలు అవుతున్నా తొలగించని వ్యర్థాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- నీటి కలుషితంతో అనర్థాలు



విగ్రహాల నిమజ్జనం కారణంగా చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు



చెరువు వద్ద పడేసిన వ్యర్థాలు

డోన్ టౌన్: వినాయక చవితి సందర్భంగా పట్టణంలో కొలువుంచిన గణేష్ విగ్రహాలను మండల పరిధిలోని వెంకటాపురం తుమ్మలచెరువు (పల్లె చెరువు)లో నిమజ్జనం చేశారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తున్నా చెరువులో వ్యర్థాలు తొలగించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. చెరువు మొత్తం వ్యర్థాలతో నిండిపోయింది. ఫలితంగా సాగు,తాగు నీరు కలుషితమవుతోందని స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలను మున్సిపల్‌శాఖ, వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు శుభ్రం చేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వెంకటాపురం, అబ్బిరెడ్డిపల్లె, బొంతిరాళ్ల గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు నెలలుగా ఎదురుచూపులే

సెప్టెంబర్ 7వ తేదీ వినాయక చవితి పండు సందర్భంగా పట్టణంలో కొలువుంచిన వినాయక విగ్రహాలను మూడు, ఐదు రోజుల పూజల అనంతరం మండల పరిధిలోని వెంకటాపురం తుమ్మల చెరువులో వందలాది విగ్రహాలను నిమజ్జనం చేశారు. పట్టణానికి చెందిన వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ, డోన్ మున్సిపాలిటీ సిబ్బంది చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేశారు. విగ్రహాలతో పాటు మండపాల్లో పూజ కోసం వినియోగించిన పూలమాలలు, చెరుకు గడలు, పండ్లు, ప్లాస్టిక్ కవర్లు, టెంకాయలు, వివిధ రకాల వస్తువులను ఇక్కడ తీసుకొచ్చి వదిలేశారు. నిమజ్జనం తరువాత ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేస్తారని భావించిన గ్రామస్తులకు ఎదురు చూపులే మిగిలాయి.

తాగు, సాగు నీరు కలుషితం

చెరువులో నిమజ్జనం చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు, ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు క్రమంగా నీటిలో కరుగుతుండడంతో తాగునీరు, సాగునీరు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు సమీపంలోని అబ్బిరెడ్డి, వెంకటాపురం, కృష్ణగిరి మండలం కర్లకుంట గ్రామాలకు చెందిన ప్రజలు కాలువల ద్వారా ప్రవహించే నీటిని తాగడానికి, ఇంటి అవసరాలకు వినియోగిస్తున్నారు. అలాగే పశువులకు ఉపయోగిస్తున్నారు. ఈ చెరువు కింద 3 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగుచేస్తున్నారు. 13 గ్రామాల రైతులు, పొలం పనుల కోసం వచ్చే కూలీలు నిత్యం తాగునీటిగా చెరువు నీటినే తాగుతున్నారు.

చేపల పెంపకానికి అవరోధం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒకటైన ఈ చెరువులో ఎస్సీ మత్స్యకార సొసైటీ సభ్యులు చేపల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కారణంగా వాటి తయారీలో ఉపయోగించే పలు రకాల రంగులు, రసాయనాల వల్ల నీరు కలుషితం అవుతోందని.. చేపలు ఎదుగుదలకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని.. లేని పక్షంలో భవిష్యత్‌లో నిమజ్జన కార్యక్రమాలను అడ్డుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలకు సకాలంలో బిల్లులు



ముక్కమల్ల జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ

సంజామల: ఇళ్ల నిర్మాణాలకు సకాలంలో బిల్లులు చెల్లిస్తామని.. లబ్ధిదారలు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని జిల్లా ఈఈ శ్రీహరి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలోని జగనన్న కాలనీని ఏఈ బాల చంద్రుడుతో కలిసి బుధవారం సందర్శించారు. లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. తర్వాత బిల్లులు మంజూరు కావని అన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: మండలంలోని కైప గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ నంద్యాలలోని రామక్రిష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. అండర్–14 విభాగంలో కె.మహేంద్ర, డి.అశ్విని, అండర్–17 విభాగంలో జి.హరినాథ్, కె.జయలక్ష్మీ ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు తిరుపతి, గుంటూరు జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు బాలవీరయ్యఆచారి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, సజ్జాద్, రఘునాథ్, సుబ్రమణ్యం, రామ కోటి, లత తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని పశువైద్యశాల



పశువైద్యశాలకు వేసిన తాళం

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలోని వెటర్నరీ లైవ్‌స్టాక్ యూనిట్ బుధవారం తెరుచుకోలేదు. కొద్ది రోజులుగా పశువైద్యశాల మూసివేసి ఉండడంతో వ్యాధిబారిన పడిన పశువులను ప్యాపిలి పశువైద్యశాలకు తీసుకెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై జేవీఓ శారదమ్మను వివరణ కోరగా తాను మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదన్నారు. పశువులకు అత్యవసరంగా వైద్యం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తమ దృష్టికి వస్తే గ్రామానికి సిబ్బందిని పంపుతామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరి కొట్టాల గ్రామ సమీపాన 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98.32 కోట్లతో నిర్మించిన 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా ప్రారంభిస్తారని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జేసీ, ఆర్డీఓ హాజరవుతారన్నారు.

11న జాబ్ మేళా



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, కేఎల్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లామా, ఐటీఐ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9573108032, 9542643747 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

బనగానపల్లె: మండలంలోని చెరువుపల్లె ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందఆచారి బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. 75 మందికి రాతపుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామనరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల బీమా రైతులే చెల్లించాలి

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారిణి జ్యోతి బుధవారం తెలిపారు. గ్రామ యూనిట్‌గా శనగ, మండల యూనిట్‌గా వరి, జొన్న, మినుము, జిల్లా యూనిట్‌గా వేరుశనగ, ఉల్లి పంటలను దిగుబడి ఆధారిత పంటల బీమాలో నోటిఫై చేసినట్లు చెప్పారు. పంట రుణాలు తీసుకోని రైతులు, కౌలుకార్డులు కలిగిన రైతులు ప్రీమియం చెల్లించి రసీదులు తీసుకోవాలని సూచించారు. వరి పంటకు డిసెంబర్ 30వ తేదీ వరకు మిగిలిన పంటలకు డిసెంబర్ 15 వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు.

జంగిల్ క్లియరెన్స్‌కు ప్రతిపాదనలు

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలోని పలు గ్రామీణ రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు రూ. 19.40 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ డీఈ ప్రసాద్ రెడ్డి బుధవారం తెలిపారు. డోన్ మండలానికి రూ. 6.90 లక్షలు, ప్యాపిలి మండలానికి రూ. 9.50 లక్షలు, బేతంచెర్ల మండలానికి రూ. 3 లక్షల చొప్పున మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేస్తామన్నారు.

జాబ్‌మేళాలో 60 మందికి ఉద్యోగాలు



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల ప్రిన్సిపాల్ లలిత

బనగానపల్లె రూరల్: జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 122 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో 60 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగం చిన్నది, పెద్దది అని ఆలోచించకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందులో రాణిస్తూ మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ బాబునాథ్, ఐక్యూఏసీ సమన్వయకర్త బడేసాహెబ్, జేకేసీ సమన్వయకర్త సీతమ్మ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్‌జీఎస్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎన్ఆర్‌జీఎస్ పథకంలో భాగంగా గోకులం పథకం షెడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. పలు అంశాలపై ఏపీఓ రేష్మా, టీఏలతో చర్చించారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే భవిష్యత్ తరాలకు విద్యాసంస్థలు, ఆస్పత్రులు తదితర వాటికి స్థలాలు లేకుండా పోతాయని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో ఆలస్యంగా సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేయడంపై వ్యవసాయాధికారిణి జ్యోతిని ప్రశ్నించారు. తిమ్మనాయినపేటలోని ఆలయ భూమిలో పవర్‌గ్రిడ్‌కు కాంట్రాక్టర్ మట్టి తవ్వకాలు చేయడంపై ఏం చర్యలు తీసుకున్నారని తహసీల్దార్ బాలీశ్వరరెడ్డిని కోరారు. ఎంత విలువైన మట్టిని తీసుకెళ్లారు..? కేసు నమోదు చేశారా అని కోరడంతో దేవదాయశాఖ అధికారులతో కలిసి సర్వేయర్‌తో సర్వే చేయిస్తున్నామని..నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్ చెప్పారు. పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ప్రభుత్వ స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించాలని సూచించారు. పాఠశాలల్లో ఇష్టానుసారంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్పు చేయడంతో చాలా మంది విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, వసతుల కోసం జెడ్పీ నుంచి నిధులు మంజూరు చేస్తే పనులు చేయించుకోకుండా నిర్లక్ష్యం వహించడంపై ఐసీడీఎస్, పీఆర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలిమిగుండ్లలో గతంలో ఎంపీ నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్ నిర్వహణ పంచాయతీ ఆధ్వర్యంలో కాకుండా ఇతర వ్యక్తులు నిర్వహించడంతో పాటు సర్పంచ్‌గా తన అధికారాలను విస్మరిస్తున్నారని సర్పంచ్ శివరాముడు సభలోనే జెడ్పీచైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌ల అధికారాలను విస్మరిస్తే చాలా సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని అధికారులకు హితవుపలికారు.

తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తారు

ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి పంచాయతీల అనుమతి లేకుండానే పనులు ఎలా చేస్తారని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గ్రామ సభలకు కూడా పిలవకుండా ఎవరితోనో టెంకాయలు కొట్టిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. శనగల పంపిణీలో సైతం కనీస సమాచారం ఇవ్వకుండా పంపిణీ చేశారని మండిపడ్డారు. గ్రామాల్లో 24 గంటల పాటు వీధిలైట్లు వెలుగుతున్నాయని ఆన్‌ఆఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలపై ఆందోళనబాట



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

కోవెలకుంట్ల: దేశవ్యాప్తంగా నిత్యావసర సరుకులు, వంటనూనెల ధరలను పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపడంతో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. కోవెలకుంట్ల రోటరీక్లబ్ భవనంలో బుధవారం సీపీఎం మూడో మండల మహాసభను జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు నాగరాజు, వెంకటలక్ష్మి, సరస్వతి, త్యాగరాజు, వెంకటేష్, హకీం, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: మండలంలోని రైతులు రబీ పంటల బీమా చెల్లించాలని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, ఉల్లి, పొగాకు పంటలను పరిశీలించారు. సాగు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్యాంకులో రుణం తీసుకున్నవారు అక్కడే బీమా చెల్లించాలని, రుణం తీసుకోని వారు మీసేవా కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ రాజునాయక్, రైతులు ఉన్నారు.

డోన్‌ను అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: డోన్ నియోజకవర్గం పర్యాటక రంగంలో అభివృద్ధి చెందిందంటే ఆ ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లి రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో పార్టీ నాయకులతో కలిసి పర్యాటక రంగం అభివృద్ధి గురించి మాట్లాడారు. నియోజకవర్గంలో రూ. 3 కోట్ల వ్యయంతో బెలుం గుహల తరహాలో వాల్మీకి గుహలను బోయవాండ్లపల్లి గ్రామం వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి చేశారని తెలిపారు. బేతంచెర్ల మండలం ఎర్రజాల గుహలతో పాటు ప్యాపిలి మండలం వెంగళాంపల్లి, డోన్ మండలం వెంకటాపురం చెరువుల వద్ద పర్యాటక కేంద్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. పర్యాటకుల కోసం రెస్టారెంట్లు, చెరువుల్లో బోట్ షికారు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కోట్లాది రూపాయలతో డోన్ మండలం ఎర్రగుంట్ల వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అన్నారు. తాగు, సాగు నీటి రంగాల్లో అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతానికి హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు సాగునీరు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటిని అందించామన్నారు. 50 ఏళ్లుగా డోన్‌కు ప్రాతినిధ్యం వహించిన నాయకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రాంతం ఎడారిగా మారిందని ఆరోపించారు. చుక్క సాగునీరు కూడా లభ్యం కాక కేవలం వర్షాధారం మీదే ఆధారపడిన ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సమావేశంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, ఆర్ట్ రమణ, వంశీ, శ్రీధర్, వైస్ ఎంపీపీ తాడూరు ఎర్రిస్వామి, నాయకులు ప్రతాప్ రెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, అంగడి పెద్దయ్య, మహేంద్రనాయుడు, డీలర్ కృష్ణ, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, అశోక్, యల్లీశ్వర్, ఆదాం, గుప్త పాల్గొన్నారు.

రామచంద్రయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు కామ్రేడ్ నీలం రామచంద్రయ్య అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ధర్మారం రంగనాయకులు అన్నారు. బుధవారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్ర వివరించారు. ఉన్నత విద్యావంతుడిగా, ఎమ్మెల్సీగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పదవులను వదులుకొని ఉద్యమబాటలో పయనించారని తెలిపారు. పార్టీ నాయకులు చందు, మునీంద్ర, లక్ష్మన్న, రామానాయుడు, దొరపల్లె రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

డోన్ రూరల్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ట్రూఅప్ చార్జీల సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రజలపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. తగ్గించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ నాయకులు మోటారాముడు, పి.సుంకయ్య, నారాయణ, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

కుక్క అడ్డురావడంతో..



గాయపడిన హనుమంతరెడ్డి

డోన్ టౌన్: కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. కృష్ణగిరి మండలం అముకదాడు గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి బుధవారం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై డోన్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని ఉడుములపాడు వద్ద రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు.

పప్పుశనగలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగవుతున్న పప్పుశనగ పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. బుధవారం మండలంలోని కంపమల్ల, భీమునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఏఓ మాట్లాడుతూ.. విత్తనానికి ముందే వర్షాలు పుష్కలంగా కురిసి వాతావరణం సాగుకు అనుకూలంగా మారిందన్నారు. పైరుకు వివిధ దశల్లో తెగుళ్లు, పురుగులు సోకకుండా ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. పశువైద్యాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా బట్టీ ధ్వంసం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో బుధవారం దాడులు చేసినట్లు ఏఎస్ఐ వెంకట నారాయణ తెలిపారు. సారా బట్టీని ధ్వంసం చేసి సుమారు 300 లీటర్ల బెల్లం ఊటను పారబోసినట్లు చెప్పారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామానికి చెందిన నేనావత్ శంకర్ నాయక్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.

ఎంఈఓ–2గా పురుషోత్తంరెడ్డి

బేతంచెర్ల: మండల విద్యాధికారి–2గా విధులు నిర్వహిస్తున్న జనార్థన్‌గౌడు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో యంబాయి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పురుషోత్తం రెడ్డిని బేతంచెర్ల ఇన్‌చార్జి ఎంఈఓ–2గా నియమించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రోడ్డా.. పశువుల దొడ్డా!



బేతంచెర్లలో రోడ్డుపైనే సేద తీరుతున్న గోవులు



వెల్దుర్తి మార్గంలో రోడ్డుపై నిలిచివున్న పశువులు

బేతంచెర్ల: పట్టణ రోడ్లపై పశువులు తిష్టవేశాయి. ఎక్కడపడితే అక్కడ సంచరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దేవుని ఆవుల పేరుతో యజమానులు వాటిని వదిలేయడంతో కాలనీలు, రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వీటి వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో నిలబడడం, సేద తీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఒక్కోసారి వాటికవే పోట్లాడుకుంటుండడంతో స్థానికులు భయాందోళకు గురవుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి ఆవుల యజమానులతో మాట్లాడి రహదారులపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.